తగ్గని బుడమేరు ఉధృతి

- జల దిగ్బంధంలోనే గ్రామాలు
- ముంపు చెర వీడని పంట పొలాలు
- అష్టకష్టాలు పడుతున్న ప్రజలు
- ఆదుకోవాలంటూ వేడుకోలు



పుట్టగుంట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న బుడమేరు

గుడివాడరూరల్: బుడమేరు ఉధృతి ఇంకా కొనసాగుతూనే ఉంది. వర్షాలు తగ్గుముఖం పట్టినా ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో బుడమేరు ప్రవాహం యథావిధిగానే ఉండటంతో గ్రామాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. పుట్టగుంట వంతెన వద్ద నీటి ప్రవాహం 24 అడుగుల నీటిమట్టం ఉండటంతో 10వ రోజు కూడా ఎంఎన్‌కే రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. విజయవాడ నుంచి వస్తున్న బుడమేరు వరద నీటితో పుట్టగుంట వంతెన వద్ద నుంచి 3 కిలో మీటర్ల దూరంలో ఉన్న జనార్దనపురం వరకు ఎంఎన్‌కే రహదారిపై మోకాళ్లలోతు నీళ్లు వచ్చి చేరాయి. నీటి ప్రవాహం ప్రమాదకరంగా ఉండటంతో పోలీసులు వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. సందర్శకులను సైతం వంతెన వద్దకు వెళ్లకుండా నిలుపుదల చేశారు. బుడమేరు నీరు అరిపిరాల, దోసపాడు చానళ్లలోకి చేరడంతో ఆ చానళ్ల కరకట్టలను దాటి ప్రవహిస్తున్నాయి. ఫలితంగా పరిసర ప్రాంతాల్లోని గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. జనార్దనపురం నుంచి కుదరవల్లి వరకు దోసపాడు చానల్ పొంగడంతో ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా ముంపునకు గురైంది. రోడ్డుపై 3 అడుగుల మేర నీళ్లు చేరి ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై ద్విచక్ర వాహనాలు, ఆటోలు వెళ్లే అవకాశం లేకపోవడంతో గుడివాడ, పరిసర ప్రాంత గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. ఇప్పటికే ఇలపర్రు, అరిపిరాల, రామాపురం, పెదవిరివాడ, పెదలింగాల, చినలింగాల, చేదుర్తిపాడు, ఒద్దులమెరక గ్రామాలకు ఇతర గ్రామాలతో సంబంధాలు లేకుండా పోవడంతో ఆయా గ్రామాల నుంచి ప్రజలు బయటకి రావడానికి మర పడవలు, స్పీడ్ బోట్లను ఉపయోగించుకోవాల్సివస్తోంది.



వరద నీటిలోనే నానుతున్న పంట పొలాలు

ముంపులోనే పంట పొలాలు...

వరదనీటి వలన పంట పొలాలు పూర్తిగా నీటమునిగాయి. 10 రోజులు గడుస్తున్నా వరద నీరు బయటకు పోకుండా పంట పొలాల్లో ముంపులోనే నానుతున్నాయి. ఇప్పటివరకు ఎంతో కొంత ఆశ ఉన్న రైతులకు ప్రస్తుతం ఇక పంట చేతికి రాదనే విషయం స్పష్టంగా తెలుస్తోంది. పంట నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ముఖ్యంగా తమిరిశ, జనార్దనపురం, పెదలింగాల, చినలింగాల గ్రామాల్లోని పంట పొలాలు పూర్తిగా మునిగిపోయాయి. అసలే డ్రైనేజీ వాటర్‌తో మునిగిన పంట పొలాలు వర్షాలు తగ్గిన తర్వాత బయటపడతాయని ఆశపడిన రైతులకు ప్రభుత్వ తీరు పుండు మీద కారం చల్లినట్లు అయ్యింది. అటు బుడమేరు వరదనీరు, ఇటు కాల్వలకు వదిలిన నీటితో పంట పొలాలు దారుణంగా మునిగి నదులను తలపిస్తున్నాయి. ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

కృష్ణానదిలో పెరుగుతున్న వరద ఉధృతి



తోట్లవల్లూరు: కృష్ణానదిలో వరద ఉధృతి పెరుగుతోంది. గత నాలుగు రోజులుగా తగ్గుముఖం పట్టిన వరద తీవ్రత మళ్లీ క్రమంగా ఎక్కువవుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటిని విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల చేస్తుండటంతో నదిలో వరద ప్రవాహం పెరుగుతోంది. ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న లంకగ్రామాల ప్రజలు వరద తీవ్రత పెరుగుతుండటంపై ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతానికి నాలుగున్నర లక్షల క్యూసెక్కుల వరద కొనసాగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. వర్షాల తీవ్రత దృష్ట్యా ఇది మరింత పెరిగే అవకాశం ఉందని అంటున్నారు.

కళాకారులకు పింఛన్ల పంపిణీ



గుడివాడటౌన్: గుడివాడ కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో దేవస్థానం చైర్మన్ జవ్వాజి గంగరాజు చేతుల మీదుగా పేద కళాకారులకు పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ గత రెండేళ్లుగా కళాకారుల సమాఖ్య ప్రతి నెలా ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున 20 మందికి పంపిణీ చేస్తూ వారిని ఆదుకోవడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో డైట్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఎంవీజే ఆంజనేయులు, సమాఖ్య అధ్యక్షుడు విన్నకోట సత్యన్నారాయణ(బుజ్జి), కార్యదర్శి టి.ఎస్.బాబు, ఉపాధ్యక్షుడు లోయ రాధాకృష్ణ, లంకపల్లి ప్రకాష్, సభ్యులు మల్లిక్, శ్యామ్, బీవీ సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీట మునిగిన ఇళ్ల సర్వే

మొవ్వ: మొవ్వ మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీరు చేరిన ఇళ్ల వివరాల సేకరణ నిమిత్తం రెవెన్యూ సిబ్బంది సోమవారం సర్వే నిర్వహించారు. మండల పరిధిలోని 21 గ్రామాల్లో గల పల్లపు ప్రాంతాల్లో వర్షం నీరు చేరటం, గోడలు చెమ్మగిల్లటం తదితర అంశాలపై సర్వే చేశారు. కూచిపూడిలో 3, నిడుమోలు ఎస్సీ కాలనీలో 17, చినముత్తేవిలో 37 (25 ఇళ్లు పోరంబోకు స్థలాల్లోవి కాగా 12 పట్టా భూములు), కాజ శివారు మందపాలెంలో 10, కళాయిగుంటలో 3 ఇళ్లను రెవెన్యూ సిబ్బంది గుర్తించారు.

మొవ్వలో రేణుకమ్మ తల్లికి సారె



మొవ్వ: మొవ్వ గ్రామంలో గల ఈడే వారి ఇలవేలుపు అయిన రేణుకమ్మ తల్లికి మహిళలు సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో సారె సమర్పించారు. జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన ఈడే వారి ఆడపడుచులు పసుపు, కుంకుమ, చీరలు, పూలు, పండ్లు, చలిమిడి, స్వీట్లతో ఊరేగింపుగా వచ్చి సారెను సమర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ



గుడివాడ టౌన్: బుడమేరు వరద కారణంగా నిరాశ్రయులకు ఆర్య వైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) ఆపన్న హస్తం అందించింది. స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల, సజ్జా బర్నబాస్‌కు చెందిన లలిత విద్యానికేతన్ లోని వరద బాధితులు 200 మందికి సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఆవోపా సభ్యుల సహకారంతో రూ.30 వేలు విలువగల ఇతర సామగ్రిని సైతం అందజేశారు. కార్యక్రమంలో ఆవోపా అధ్యక్షుడు కొప్పెట్టి శ్రీనివాసు, రాధాకృష్ణ, పి.శ్రీనివాస గణేష్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ నవరాత్రులు

తోట్లవల్లూరు: స్థానిక పోస్టాఫీస్ రోడ్డులో బ్రాహ్మణ యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజా మండపంలో గణనాథుని విగ్రహానికి సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు జరిపారు.

ప్రజల సంరక్షణకు ప్రభుత్వం చర్యలు

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



వరద ప్రాంతాల్లో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాము

గుడివాడరూరల్: నందివాడ మండలంలో వరద ముంపునకు గురైన తమిరిశ, అనమనపూడి, శంకరంపాడు, పోలుకొండ గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ ప్రజల సంరక్షణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపడుతుందన్నారు. వర్షాల ప్రభావం, ఎగువ నుంచి వస్తున్న వరద నీటి వల్ల మరో రెండురోజులు ముంపు సమస్య కొనసాగుతుందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. తొలుత వరద బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు కామేపల్లి తులసీబాబు, పిన్నమనేని బాబ్జీ, కడియాల గణేష్, పంచకర్ల మహేష్, టీడీపీ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు పాల్గొన్నారు.

ప్రమాదపుటంచుల్లో బంటుమిల్లి ప్రధాన కాలువ



బంటుమిల్లి నాగేశ్వరరావుపేట వద్ద కాలువ కట్ట వద్ద మట్టి వేసిన రైతులు

బంటుమిల్లి: బంటుమిల్లి ప్రధాన కాలువ ప్రమాదపు అంచుల్లో ప్రవహిస్తోంది. సాతులూరు రేవు వద్ద అంచులు దాటి నీరు గ్రామంలోకి వస్తుందని భావించి అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆదివారం రాత్రి నీటి ప్రవాహం పెరిగి, నాగేశ్వరరావుపేట వద్ద నీరు గ్రామంలోకి ప్రవేశించే పరిస్థితి తలెత్తడంతో అధికారులు, గ్రామస్తులు రాత్రి వేళ జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో కోతకు గురైన ప్రాంతంలో మట్టిపోసి తీసుకున్నారు. దీంతో కాలువ ప్రాంత గ్రామాల్లో ఆందోళన నెలకొంది.

ట్రెక్కింగ్ క్యాంప్‌నకు గూడూరు విద్యార్థిని

గూడూరు: ఆల్ ఇండియా ఎన్‌సీసీ గరల్స్ ట్రెక్కింగ్ క్యాంప్‌నకు గూడూరు విద్యార్థిని లింగం రెజీనా ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని డి.పుష్పలత తెలిపారు. ఈ నెల 10 నుంచి 17 వరకు వారం రోజుల పాటు కేరళలో ట్రెక్కింగ్ క్యాంప్ జరగనుంది. గూడూరు హైస్కూల్ ప్లస్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న రెజీనా ప్రతిష్ఠాత్మకమైన ట్రెక్కింగ్ క్యాంప్‌నకు ఎంపికవడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయిని పుష్పలత, పాఠశాల ఎన్‌సీసీ ఆఫీసర్ మత్తి అరుణ, పీడీ రాజేష్ తదితరులు అభినందించారు.

ఘనంగా వినాయకుడి ఊరేగింపు

మండవల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయకచవితి పండుగ పురస్కరించుకుని గణనాథునికి సోమవారం కనుల పండువగా ఊరేగింపు నిర్వహించారు. మండల కేంద్రమైన మండవల్లి గ్రామంలోని శ్రీ కృష్ణాలయం, రైల్వేగేట్ వద్ద, పల్లపు బజార్‌లో, పెరికెగూడెంలోని ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు ఊరేగింపు నిర్వహించారు. మండవల్లిలోని ఊరేగింపు కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, యాదవ సంఘం యూత్ పాల్గొన్నారు.

రావిచెట్టులంకలో ఉచిత వైద్య శిబిరం



రావిచెట్టులంకకు పడవలో తరలివెళుతున్న ఆరోగ్య సిబ్బంది

తోట్లవల్లూరు: లంక గ్రామాల ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని తోట్లవల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న సూచించారు. మండలంలోని వల్లూరుపాలెం శివారు రావిచెట్టులంకలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సాయిప్రసన్న గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. హెల్త్ సూపర్‌వైజర్లు అనిల్‌కుమార్, రోహిణి, మురళీకృష్ణ, ఏఎన్ఎంలు విజయ, ఇందిరాదేవి, ఆశ కార్యకర్తలు జనని, సునీత, అనురాధ, రాజేశ్వరి పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ముదినేపల్లి రూరల్: భారీ వర్షాలతో అంటువ్యాధులు ప్రబలకుండా మండలంలోని పలు పంచాయతీల పరిధిలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎంపీడీవో పి.మల్లీశ్వరి గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు ఇప్పటికే పలు గ్రామాల్లో జేసీబీలతో కచ్చా డ్రైన్లు తవ్వించి, అంతర్గత రోడ్లపై నిల్వ ఉన్న మురుగునీరు బయటకు పోయేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం అంటువ్యాధులు ప్రబలకుండా రోడ్ల వెంబడి బ్లీచింగ్ పౌడర్ చల్లించే కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. పెయ్యేరు వైఎస్సార్ కాలనీలో అంతర్గత రోడ్ల వెంబడి బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు ఫాగింగ్ యంత్రంతో దోమల మందును పిచికారీ చేయించారు. చినకామనపూడి పంచాయతీలో సర్పంచ్ చిట్టూరి నాంచారయ్య పర్యవేక్షణలో రోడ్ల వెంబడి మురుగునీరు తొలగించి బ్లీచింగ్ చల్లించారు. వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

నిమజ్జనాలకు ప్రత్యేక కమిటీలు

ముదినేపల్లి రూరల్: వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా నిర్వహించే నిమజ్జన కార్యక్రమాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ సుభాని వివిధ శాఖల అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి కార్యాలయంలో ఎంపీడీవో పి.మల్లీశ్వరి, ఎస్ఐ డి.వెంకటకుమార్, పంచాయతీ, రెవెన్యూ సిబ్బందితో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిమజ్జనాలకు జాయింట్ యాక్షన్ కమిటీలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్సవ కమిటీలతో సమావేశాన్ని నిర్వహించి నిమజ్జన ప్రదేశాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ శాఖ నుంచి వీఆర్వో, పంచాయతీరాజ్ శాఖ నుంచి సెక్రటరీ, పోలీసు శాఖ నుంచి మహిళా పోలీసులు జాయింట్ కమిటీలుగా ఏర్పడి నిమజ్జనాలు పర్యవేక్షించాలన్నారు. ఈవోపీఆర్డీ డి.లక్ష్మీనారాయణ, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు సమావేశంలో పాల్గొన్నారు.

పాము కాటుకు మహిళ మృతి



మృతురాలు బేబమ్మ

గుడివాడ టౌన్: పాము కాటుకు మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం పట్టణంలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం స్థానిక కార్మిక నగర్ చంద్రయ్య డ్రెయిన్ చిన్న వంతెన సమీపంలో నివసిస్తున్న చానాపతి బేబమ్మ (67) కార్మిక నగర్ మున్సిపల్ ప్రైమరీ పాఠశాలలో ఆయాగా పనిచేస్తుంది. ఉదయం పని ముగించుకుని ఇంటికి వచ్చి దుస్తులు ఆరేస్తున్న సమయంలో ఆమె పాముకాటుకు గురైంది. స్థానికుల సహాయంతో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతూ మృతి చెందింది.

బేబమ్మకు నష్ట పరిహారం చెల్లించాలి

గత 25 సంవత్సరాలుగా కార్మిక నగర్ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో ఆయాగా పనిచేస్తున్న బేబమ్మ ప్రమాదవశాత్తు మృతి చెందడం దురదృష్టకరమని సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. ఆమెకు ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆక్రమణలు తొలగించాలి

ముదినేపల్లి రూరల్: మండలంలోని వణుదుర్రు శివారు కొత్తపల్లి మెయిన్‌రోడ్డు వెంబడి ఆక్రమణలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. రోడ్డు వెంబడి డ్రైనేజీని పూడ్చి వేస్తూ నిర్మాణాలు చేస్తున్నందున పలు సమస్యలు ఎదురవుతున్నట్లు వాపోతున్నారు. భారీ వర్షాల సమయంలో వర్షపు నీరు కదలకుండా రోడ్డుపైనే నిలిచిపోతున్నందున వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నట్లు వాపోయారు. సంబంధిత అధికారులు వెంటనే ఆక్రమణలను తొలగించాలని కోరుతున్నారు.

శ్రీ హేరంభ గణపతిగా స్వామి వారు



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్‌లో ఉన్న శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో గణపతి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మహోత్సవాలలో భాగంగా స్వామి వారిని శ్రీ హేరంభ గణపతి స్వామిగా అలంకరించి భక్తుల దర్శనానికి ఉంచారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పామర్రు మురుగు డ్రెయిన్ పూడిక తీయించాలి

పామర్రు: పామర్రు మురుగు డ్రెయిన్ గట్లపై ఉన్న ఆక్రమణలను తొలగించి డ్రెయిన్‌లో పూడిక తీత పనులు చేయించాలని కోటిరెడ్డి పేట వాసులు విజ్ఞప్తి చేశారు. పామర్రు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం వారు ఈ మేరకు ఎంపీడీఓకు అర్జీని సమర్పించారు.

ఘనంగా గణనాథునికి నిమజ్జనోత్సవం

పామర్రు: స్థానిక వల్మీకేశ్వరీ అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విఘ్నేశ్వర స్వామికి విశేషంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామిని ట్రాక్టరుపై మేళతాళాలతో, డప్పు వాయిద్యాలతో విద్యుత్ దీపాల కాంతులలో ఊరేగించారు. అనంతరం స్థానిక పుల్లేరు కాలువలో నిమజ్జనం చేశారు.

సర్పంచులకు చెక్కుల పంపిణీ

మండవల్లి: మండలంలోని పెనుమాకలంక, నందిగామలంక, ఇంగిలిపాకలంక, కొవ్వాడలంక, మణుగునూరు గ్రామాలకు మంజూరైన చెక్కులను సోమవారం ఆయా గ్రామ సర్పంచులకు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, చాపరాల దుర్గాప్రసాద్, సజ్జా సురేష్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దెబ్బతిన్న ఇళ్లు పరిశీలన



మండవల్లిలో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో పూర్ణ చంద్రశేఖర్, ఎంపీడీవో , ఇన్‌చార్జి తహసీల్దార్

మండవల్లి: మండవల్లి రైల్వే గేట్ సమీపంలో దెబ్బతిన్న ఇళ్లను డీఎల్‌పీవో కె.పూర్ణచంద్రశేఖర్, ఎంపీడీవో టీకే వెంకటరమణతో కలిసి సోమవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విపత్తు ద్వారా పేద ప్రజలు ఆర్థికంగా నష్టపోయారన్నారు. సర్పంచ్ మెండా ఝాన్సీ, ఈవోపీఆర్డీ బి.ఆనందబాబు, మెండా సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వం ఘోర వైఫల్యం



పమిడిముక్కల: వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. బాధితులను ఆదుకోవడం మాని బురద రాజకీయాలు చేస్తోంది. భారీ వర్షాలు, వరదలు వస్తాయని ముందే తెలిసినప్పటికీ ప్రజలను అప్రమత్తం చేయలేదు. సీఎం చంద్రబాబు ఇల్లు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ యాక్టివ్ పవర్ ప్లాంట్ మునిగిపోకుండా కాపాడేందుకే బుడమేరు నుంచి నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడ నగరంపైకి వదిలేశారు. వర్షం, వరద తగ్గుముఖం పట్టిన తర్వాత కూడా కనీస వసతులకు నోచుకోని దుస్థితి ఉంది. వరద వచ్చి 8 రోజులు గడుస్తున్నా బాధితులకు ఇప్పటికీ పూర్తి స్థాయిలో ఆహారం అందడం లేదు. ప్రచార ఆర్భాటాల వల్ల సహాయక చర్యల్లో సమన్వయ లోపం నెలకొంది. కుటుంబ సభ్యుల్ని కోల్పోయి ఒకరు, వ్యాపారాలు తుడిచిపెట్టుకుపోయి మరొకరు, ఉపాధి కోల్పోయి, ఇల్లు ధ్వంసమై ఇంకొకరు..ఇలా వరద బాధిత ప్రాంతాల్లో ప్రజలు దీనాతిదీనస్థితిలో ఉన్నారు. వరద బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి.

– కైలే అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే, పామర్రు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్

ఆగని వర్షం...మాగాణి రైతుకు నష్టం



తోట్లవల్లూరులో వర్షం నీటిలో కుళ్లిపోతున్న వరి పైరు



తోట్లవల్లూరులో చెరకుతోటలో భారీగా నిలిచిన వర్షం నీరు

తోట్లవల్లూరు: వర్షాలతో అన్నదాతలకు అవస్థలు తప్పటం లేదు. ఒకవైపు కృష్ణానది వరదతో లంక రైతులు తీవ్రంగా నష్టపోయిన విషయం విదితమే. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మాగాణి రైతులకు కూడా నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడుతోంది. వర్షం ఆగకుండా కురుస్తుండటంతో మాగాణి పొలాల్లో నీరు భారీగా చేరుతోంది. ముఖ్యంగా పల్లపు ప్రాంతాల్లోని పొలాల్లో వర్షం నీరు ముందుకు కదిలే పరిస్థితి లేకుండా పోతోంది. దీంతో పలుచోట్ల వరి పొలాలు వర్షం నీటిలో మగ్గిపోతుండగా, మరికొన్ని చోట్ల దెబ్బతింటున్నాయి. చెరకు తోటల్లో సైతం వర్షం నీరు భారీగా నిలిచి ఉంటోంది. వర్షాల తీవ్రత ఎక్కువ కావటం వలన పంట ఎదుగుదల, నాణ్యత లోపించి దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లో నీరు బయటకు పంపేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

వరద బాధితులకు రూ.50వేలు ఆర్థిక సహాయం



ఎమ్మెల్యే రాముకు రూ.50 వేల చెక్కును అందజేస్తున్న కొండపల్లి చంద్రశేఖరరెడ్డి

గుడివాడరూరల్: వరద బాధితులను ఆదుకునేందుకు కొండపల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి చంద్రశేఖరరెడ్డి రూ.50వేలు చెక్కును సీఎం రిలీఫ్ ఫండ్ నిమిత్తం ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు సోమవారం అందజేశారు. గుడివాడ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలసి చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ ప్రకృతి విపత్తుకు సర్వం కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధితుల సహాయార్థం ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు కూడా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎన్జీవో గుడివాడ శాఖ కార్యదర్శి జి.రాజేంద్రప్రసాద్, టీడీపీ నాయకులు కామేపల్లి తులసీబాబు, గడ్డం ప్రకాష్‌దాస్ పాల్గొన్నారు.

పెదపూడి సబ్ సెంటర్‌లో పోషణ్ మహా కార్యక్రమం



పోషణ్ మహా కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు, గర్భిణులు, బాలింతలు

పెదపూడి(మొవ్వ): ఐరన్ ఎక్కువగా ఉండే ఆకుకూరలు, పొట్టుతో ఉండే ధాన్యాలు, డ్రైఫ్రూట్స్ తీసుకోవటం వలన రక్తహీనత తగ్గించవచ్చునని కూచిపూడి సెక్టార్ సూపర్ వైజర్ ఏఎస్ కళ్యాణి సూచించారు. పెదపూడిలోని హెల్త్ సబ్ సెంటర్‌లో సోమవారం పోషణ్ మహా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భవతులకు, బాలింతలకు, కిషోర బాలికలకు రక్తహీనతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.పౌష్టికాహారం, రక్తహీనత గూర్చి వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు కె.బుజ్జి, కమల, అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్ నాగమణి, సీహెచ్ జ్యోతి, జి.పద్మజ, కె.జ్యోతిలక్ష్మిలతో పాటు ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

ముంపు పొలాల పరిశీలన

ముదినేపల్లి రూరల్: భారీ వర్షాల వలన ముంపు బారిన పడ్డ పొలాలను వ్యవసాయాధికారులు సోమవారం పరిశీలించారు. మండవల్లి సబ్ డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి, మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్, పేరూరు, దాకరం, వడాలి గ్రామాల్లో ముంపు బారిన పడిన పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వారం నుంచి వరద నీటిలో పైరు నానుతూ దెబ్బతింటున్నందున తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పలువురు రైతులు అధికారులకు మొర పెట్టుకున్నారు. డ్రెయిన్లు సక్రమంగా ప్రవహించడం వలన పొలాల్లోని నీరు బయటకు పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వలన పైరు కుళ్లిపోతుందని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పైర్లు దెబ్బతినకుండా తీసుకోవలసిన చర్యల గురించి అధికారులు రైతులకు వివరించారు.

రోటరీ క్లబ్ మాజీ అసిస్టెంట్ గవర్నర్ రామకృష్ణారావు మృతి



రామకృష్ణారావు(ఫైల్)

గుడివాడ టౌన్: రోటరీ క్లబ్ మాజీ అసిస్టెంట్ గవర్నర్ నిమ్మగడ్డ వెంకట రామకృష్ణారావు(85) సోమవారం మృతి చెందారు. పట్టణంలో రోటరీ క్లబ్ ప్రారంభించిన నాటి నుంచి ఆ క్లబ్ సభ్యునిగా, అధ్యక్షునిగా, కార్యదర్శిగా, డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్‌గా నాలుగు పర్యాయాలు ఎంపికై పలు సేవలందించారు. రోటరీక్లబ్ అభివృద్ధికి భారీ విరాళాలు ఇచ్చి మేజర్ డోనర్ లెవల్-1 పతకం పొందారు. ఈయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. ఈయన మృతి పట్ల రోటరీక్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, డిస్ట్రిక్ట్ కౌన్సిలర్ సంతాపం తెలిపారు.